సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



ఏయూ పరువు పాయే..!

బాణసంచా దుకాణాల అనుమతుల విషయంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం చర్చనీయాంశమైంది. IIలో



బయో డైవర్సిటీ పార్క్ సందర్శన

జీచ్‌రోడ్డు: ఏయూ పర్యావరణ విభాగం విద్యార్థులు బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.



పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెద్దేరు జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల: పెద్దేరు జలాశయం నుంచి గురువారం సాయంత్రం 300 క్యూసెక్కుల వరద నీటిని ప్రధాన గేటు ద్వారా విడుదల చేశారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.50 మీటర్లకు చేరుకోవడంతో పెద్దేరులోకి వరద నీరు విడుదల చేస్తున్నారు. పెద్దేరు ఏటి బాధితులు రాత్రి పూట నీటిలోకి దిగరాదని తహసీల్దార్ రమాదేవి తెలిపారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

తుమ్మపాల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే గత నెలలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతి పత్రాలను అందజేసిన ఉద్యోగులు కూడా హాజరై, తమ అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలను తెలుసుకోవచ్చని సూచించారు.

వచ్చే నెల 8, 9 తేదీల్లో ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.సత్యవతి

అనకాపల్లి: ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలు వచ్చేనెల 8, 9 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సత్యవతి తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో గురువారం జిల్లా ఆశా వర్కర్స్ మండల కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిందని, అప్పటి నుంచి ఆశా కార్యకర్తలు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. హెచ్‌ఐవీ, లెప్రసీ, క్షయ వంటి వ్యాధులపై ప్రజలను చైతన్యం చేస్తున్నారని చెప్పారు. ఆశా కార్యకర్తల కృషితో మాతా, శిశు మరణాలు తగ్గాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగినట్టు చెప్పారు. మహాసభలకు రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి సుమారుగా 300 మంది ప్రతినిధులు, ఆశా వర్కర్స్ యూనియన్ అఖిల భారత నాయకులు హాజరు కానున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, జిల్లా కోశాధికారి ఈ.పార్వతి, కార్యదర్శి ఎం.సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

● డీఆర్వోకు పప్పు.. ఉప్పు.. కొనివ్వాల్సిందే..!

రెవెన్యూలో శ్రీలేఖ కలకలం



ప్రతి నెలా రూ.20 వేల ఖర్చు

శ్రీకాకుళంలోని డీఆర్వో కుటుంబానికీ ప్రతి నెలా కిరాణా సరకులు పంపాల్సిందే

తహసీల్దారు కార్యాలయాలకు భారంగా వ్యవహారం

విశాఖ డీఆర్వోను నియంత్రించాలంటూ కలెక్టర్‌కు ఆర్డీవో శ్రీలేఖ లేఖాస్త్రం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

'జిల్లా రెవెన్యూ **అధికారి (డీఆర్వో) క్యాంపు** కార్యాలయానికి అవసరమైన చింతపండు, పసుపు, గోధుమపిండితోపాటు ఫెయిర్ అండ్ లవ్లీ క్రీములు, బట్టల క్లిప్పులు ఇలా అన్ని కొనివ్వాల్సిందే. ఈ భారమంతా నా పరిధిలోని తహసీల్దారు కార్యాలయాలపై పడుతోంది. ప్రతి నెలా రూ.20 వేల విలువైన కిరాణా సామగ్రి పంపాల్సి వస్తోంది. అంతేకాకుండా శ్రీకాకుళంలోని ఆయన కుటుంబానికి కూడా ప్రతి నెలా కిరాణా సామగ్రి పంపాల్సి వస్తోంది. గాజువాక, పెందుర్తి తహసీల్దారు కార్యాలయ సిబ్బందిపై ఈ భారాన్ని మోపుతున్నారు. దీనిపై విచారణ చేసి ఆ ఖర్చు పడకుండా చూడండి' అంటూ కలెక్టరుకు విశాఖపట్నం ఆర్డీవో శ్రీలేఖ లేఖ రాయడం సంచలనమైంది. ప్రతి నెలా ఈ భారాన్ని మోపకుండా చూడాలంటూ కలెక్టరును అభ్యర్థించిన ఆమె.. దీని ప్రభావంతో వారు అవినీతికి పాల్పడటం ద్వారా ప్రజల్లో చులకన అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

● సీతమ్మధార, పద్మనాభం మండలాల పరిధిలోని రెవెన్యూ సిబ్బందిపై కూడా ఇదే తరహాలో ఉప్పు, పప్పు భారం మోపుతున్నట్టు ఆమె ఆరోపించారు. రెవెన్యూశాఖ ఉన్నతాధికారి కావడంతో సిబ్బంది ఏమీ అనలేకపోతున్నారని... ఈ కారణంగా వారు అవినీతికి పాల్పడటం వల్ల ప్రజల్లో చులకన అయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. అయితే దీనిపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



ఇద్దరి మధ్య కోల్డ్‌వార్

వాస్తవానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగంలో లోలోపల వివాదాలు నడుస్తున్నట్టు తెలుస్తోంది. డీఆర్వో, ఆర్డీవోల మధ్య కొంత కాలంగా పలు వ్యవహారాల్లో కోల్డ్ వార్ నడుస్తోందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇరువురూ ఉప్పు–నిప్పుగా వ్యవహరిస్తున్నట్టు కూడా చర్చ జరుగుతోంది. తాజాగా కలెక్టర్‌కు రాసిన లేఖతో వీరువురి మధ్య వివాదం కాస్తా ముదురు పాకాన పడినట్టు తెలుస్తోంది.

శ్రీకాకుళానికి కిరాణా సామగ్రి

ప్రతి నెలా డీఆర్వో క్యాంపు కార్యాలయానికి అవసరమైన కిరాణా సామగ్రి ఖర్చు రూ.20 వేల వరకూ అవుతోందని తాను సేకరించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోందని ఆర్డీవో తన లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయన కుటుంబం ఉంటున్న శ్రీకాకుళానికి కూడా పంపాల్సి వస్తోందంటూ పేర్కొనడం గమనార్హం. కేజీ చింతపండు, కేజీ పసుపు కొమ్ములు, కిరాణాతోపాటు ఫెయిర్ అండ్ లవ్లీ క్రీములు, బట్టల క్లిప్పుల ఖర్చు భారం రెవెన్యూ సిబ్బందిపై వేస్తున్నారంటూ తన లేఖలో ఆరోపించడం గమనార్హం. రెవెన్యూశాఖ పరిధిలో డీఆర్వో ఉన్నతాధికారి కావడంతో.... రెవెన్యూ సిబ్బందిపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందని ఆమె పేర్కొన్నారు. తద్వారా కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందిలో అవినీతి పెరిగిపోయేందుకు కూడా ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

విచారణ జరపండి..

డీఆర్వో క్యాంపు ఖర్చుల భారం తన పరిధిలోని పెందుర్తి, గాజువాక రెవెన్యూ సిబ్బందితో పాటు సీతమ్మధార, పద్మనాభం మండలాల పరిధిలోని రెవెన్యూ సిబ్బందిపై కూడా పడుతున్నట్టు పేర్కొన్నారు. క్యాంపు ఖర్చులకు సంబంధించిన బిల్లులన్నీ చేతితో రాసినవే ఉన్నాయని... కంప్యూటర్ బిల్లులు మాత్రం తన వద్ద లేవని లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని కలెక్టరుకు విన్నవించారు. నా పరిధిలోని తహసీల్దారు కార్యాలయ సిబ్బంది నుంచి డీఆర్వో క్యాంపు ఖర్చుల భారం పడకుండా చూడాలని కూడా ఆమె తన లేఖలో కలెక్టరును కోరారు. ఈ వ్యవహారం ఎటువైపు దారితీస్తుందో చూడాల్సి ఉంది. అయితే ఈ లేఖపై కలెక్టర్ విచారణకు ఆదేశిస్తారా? లేఖ రాసిన ఆర్డీవోపై చర్యలు తీసుకుంటారా అనేది చూడాల్సి ఉంది.

అనంతుని పవిత్రోత్సవాలు ప్రారంభం



పాత సంత స్థలంలో మేదిని మాతకు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గురువారం రాత్రి వేద పండితుల వేద మంత్రోచ్చారణాల నడుమ పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి ఆలయంలోని చక్ర పెరుమాళ్లను పల్లకిలో పాత సంత స్థలం వద్దకు పల్లకీలో తోడ్కొని వచ్చారు. ఇక్కడ మేదిని మాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, మొకర అప్పలనాయుడు, తాలాడ పైడిరాజు, అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్ (విశాఖ): పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్యాషన్ అండ్ గార్మెంట్ మేకింగ్ వృత్తివిద్యా కోర్సు బోధనకు ఒక అతిథి అధ్యాపక పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (టెక్స్‌టైల్ అండ్ క్లాతింగ్ ఇన్ హోంసైన్స్)లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులు. ఈ నెల 22న ఇంటర్వ్యూ జరుగుతుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇతర వివరాల కోసం మద్దిలపాలెంలోని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

రోడ్డు నిర్వాసితులకు పరిహారమే ఇవ్వాలి

- టీడీఆర్ బాండ్లు రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు
- అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితుల సంఘం నాయకుడు రాము



వీఎంఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌కు హైకోర్టు తీర్పు కాపీని అందజేస్తున్న నిర్వాసిత సంఘం నాయకులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం–అనకాపల్లి రహదారి విస్తరణ బాధితులకు ఇస్తున్న టీడీఆర్ బాండ్లకు సంబంధించి వీఎంఆర్‌డీఏ జారీ చేసిన నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసిందని నిర్వాసితుల సంఘం నాయకుడు ఆర్.రాము తెలిపారు. ఈ మేరకు హైకోర్టు కాపీని గురువారం వీఎంఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌కు అందజేశారు. అంతకు ముందు అనకాపల్లి ఆర్డీవోకు సైతం ఈ కాపీని అందించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ హైకోర్టు టీడీఆర్ బాండ్లను రద్దు చేసినందున 2013 భూసేకరణ చట్టం ప్రకారం రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే అందించిన టీడీఆర్ బాండ్లు కూడా చెల్లవని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్పొరేటర్ వి.గంగారావు, కో కన్వీనర్ కె.సదాశివ రావు, రైతు సంఘం నాయకుడు కర్రి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలి IIలో

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నుంచి పంచారామాలు దర్శనానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం పురస్కరించుకుని ఈ నెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బస్సు బయలుదేరి.. మర్నాడు రాత్రి 10 గంటలకు తిరిగి అనకాపల్లి చేరుకుంటుందని పేర్కొన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలు సందర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. మిగతా రోజుల్లో భక్తులు గ్రూపుగా బస్సులను ఆన్‌లైన్ (www. apsrtconline. in)లో బుక్ చేసుకోవచ్చన్నారు. అలాగే అయ్యప్ప భక్తులు, కార్తిక మాసంలో పిక్నిక్‌కు వెళ్లే వారికి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్, విజిలెన్స్ దాడులు

సాక్షి, అనకాపల్లి: గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బుధ, గురువారాల్లో దాడులు చేశారు. రాంబిల్లి మండలం చినపూడి గ్రామంలో షిర్డీ ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న అధికారులు తనిఖీలు చేసి, అక్కడున్న వాహనాలను సీజ్ చేశారు. ఎంత ఏరియాలో గ్రావెల్ తవ్వకాలు జరిగాయో ఆ ప్రదేశాన్ని కొలతలు వేసిన చినపూడి వీఆర్‌వో కేసు నమోదు చేసి జరిమానా వేశారు. తవ్వకాలు జరిగే చోట ఉన్న ఆరు టిప్పర్ లారీలు, రెండు పొక్లెయిన్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని, రాంబిల్లి రెవెన్యూ సిబ్బందికి మైనింగ్ అధికారులు అప్పగించారు.




గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు

వీఆర్‌ఎస్ ఉద్యోగులకు రెండో విడత చెల్లింపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) చేసిన ఉద్యోగులకు గురువారం వీఆర్‌ఎస్ పరిహారం రెండో విడత చెల్లింపులు చేశారు. దీంతో ఇప్పటి వరకు 50 శాతం పరిహారం చెల్లించినట్టయింది. ఉక్కు యాజమాన్యం ప్రకటించిన వీఆర్‌ఎస్–2లో యాజమాన్యం మొత్తం 464 మందికి వీఆర్‌ఎస్ ఇచ్చారు. వారు సెప్టెంబర్ 30న రిలీవ్ అయ్యారు. చివరి రోజు చెల్లించాల్సిన పరిహారాన్ని నాలుగు విడతలుగా చెల్లించడానికి యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన మొదట విడత 25 శాతం చెల్లించగా ఇప్పుడు రెండో విడత చెల్లించారు. నెలాఖరులోగా మిగిలిన 50 శాతం చెల్లిస్తారని వీఆర్‌ఎస్ ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

30 మందిని బలిగొన్న రసాయన పరిశ్రమలు



రాజయ్యపేటలో క్యాన్సర్, కిడ్నీ సమస్యలతో చనిపోయిన వారి ఫొటోలతో దీక్ష చేస్తున్న మత్స్యకారులు

- మరణించిన వారి ఫొటోలతో దీక్ష చేసిన మత్స్యకారులు
- రాజయ్యపేటలో 33వ రోజుకు చేరిన ఆందోళన


నక్కపల్లి: తమ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమల వల్ల ప్రమాదకరమైన క్యాన్సర్, కిడ్నీ సమస్యలతో సుమారు 30 మంది వరకు చనిపోయారని మత్స్యకారులు ఆరోపించారు. బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని కోరుతూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 33వ రోజుకు చేరుకున్నాయి. అనారోగ్యంతో మరణించిన వారి ఫొటోలతో వారు గురువారం నిరాహార దీక్ష కొనసాగించారు. కంపెనీల నుంచి వెలువడే కాలుష్య వాయువులు పీల్చి చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. మహిళలకు గర్భస్రావాలు జరిగాయని, కొంతమంది దీర్ఘకాలిక వ్యాధులు సోకి ఖరీదైన మందులు పెట్టి నయం చేసుకునే స్థోమత లేక మృత్యువాత పడ్డారన్నారు. కొన్ని కుటుంబాల్లో భార్యాభర్తలు కూడా మరణించిన వారిలో ఉన్నారన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు అనాథలుగా మిగిలారన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి గాని, కంపెనీల నుంచి గాని ఎటువంటి ఆర్థిక సాయం అందలేదన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటయితే పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఏర్పాటవుతాయని, రాజయ్యపేట కనుమరుగవుతుందని, చిన్నపిల్లలకు సైతం క్యాన్సర్, కిడ్నీ సమస్యలు వస్తాయన్నారు. ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, నాగేశు, సోమేష్, బైరాగి రాజు, సూరిబాబు, మహేష్, నారాయణ రావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత రీసర్వేకు 30 గ్రామాల గుర్తింపు



రాజుపేట అగ్రహారం రెవెన్యూ గ్రామంలో రీసర్వేపై రైతులతో మాట్లాడుతున్న సర్వే ఏడీ గోపాలరాజు, తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: జిల్లాలో భూ రీసర్వే చేయడానికి మూడో విడతలో 30 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశామని సర్వే ఏడీ గోపాలరాజు చెప్పారు. ఆయన గురువారం రాజుపేట అగ్రహారం గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో ఇంతవరకు చేసిన రీసర్వేపై రైతులతో మాట్లాడారు, అనంతరం ఆయన విలేకరులతో మాట్లా డుతూ మొదటి విడతలో జిల్లావ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక రెవెన్యూ గ్రామం చొప్పున 24 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. రెండో విడతలో 30 గ్రామాల్లో రీసర్వే చేపట్టామని, ఈనెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. మూడో విడతలో రీసర్వేకు ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో ముందుగా తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, నర్సీపట్నం డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ ఎల్.బంగారుదేవి, మండల సర్వేయరు సత్యనారాయణ, ఆర్ఐ నాగరాజు, సచివాలయ సర్వేయరు విజయకుమార్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో ఉపమాక రోడ్డు ఆర్చి వద్ద తనిఖీలు

ఇంటికో పోలీసు, వీధికో పికెట్

పోలీసుల ఆధీనంలోనే రాజయ్యపేట

- అన్ని దారులు పోలీసుల గుప్పెట్లోనే
- ఏం జరగబోతుందోనని భయాందోళనలు
- కలెక్టర్ వచ్చి వెళ్లిన తర్వాత తదుపరి చర్యలు ఉండే అవకాశం




గ్రామంలో పోలీసు కవాతు

నక్కపల్లి: రాజయ్యపేటలో గురువారం కూడా పోలీసుల బందోబస్తు యథావిధిగా కొనసాగింది. మరికొంతమంది పోలీసులు బందోబస్తు కోసం నక్కపల్లి, రాజయ్యపేట చేరుకున్నారు. సివిల్ పోలీసులతోపాటు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు మోహరించారు. వారు గ్రామంలో కవాతు నిర్వహించారు. ఇంటికో పోలీసు, వీధికో పికెట్ అన్నట్లుగా ఉంది ప్రస్తుతం రాజయ్యపేట గ్రామ పరిస్థితి. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు హింసాత్మక ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులను భారీగా మోహరించామని అధికారులు చెబుతున్నప్పటికీ ఏదో జరగబోతోందన్న అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. రాజయ్యపేట గ్రామాన్ని పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. రాజయ్యపేట వెళ్లే అన్ని మార్గాల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రాజయ్యపేట వెళ్లే అన్ని వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నక్కపల్లిలో ఉపమాక రోడ్డు ఆర్చి వద్ద, ఉపమాకలో, బుచ్చిరాజుపేట, బోయపాడు, దొండవాక, సిహెచ్‌ఎల్ పురం కూడళ్లలో పోలీసులు పికెట్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. బల్క్ డ్రగ్ పార్క్ పనులు జరిగే ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలను ఆయా కూడళ్లలో అడ్డుకుని ఆటోలో రాకపోకలు సాగించే వారు ఎవరు, ఎక్కడ నుంచి వస్తున్నారు, ఎక్కడకు వెళ్తున్నారనే వివరాలను తెలుసుకుంటున్నారు. యూనిఫాంలో ఉన్నవారితోనే కాకుండా మఫ్టీలో కూడ కొంతమంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. బల్క్ డ్రగ్ ఉద్యమంలో మత్స్యకారుల వ్యూహం ఏంటి, ఏం జరగబోతోంది, రాబోయే రోజుల్లో వారు ఎటువంటి చర్యలకు దిగబోతున్నారనే విషయాలను తెలుసుకునేందుకు చాపకింద నీరులా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.


శిబిరాన్ని ఖాళీ చేయిస్తారా..?

మత్స్యకారులతో చర్చలు జరిపేందుకు కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం రాజయ్యపేట రావాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల కలెక్టర్ రాలేదు. కలెక్టర్‌తో చర్చల అనంతరం మత్స్యకారులు తీసుకునే చర్యలపైనే పోలీసుల ప్రతి చర్యలుండే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం అనుమతి లేకుండా ధర్నా చేయడం, హోంమంత్రిని అడ్డుకోవడం, జాతీయరహదారిని ముట్టడించి నాలుగు గంటల పాటు ధర్నా చేయడం వంటి ఘటనలపై పలు సెక్షన్లతో చాలామందిపై కేసులు నమోదు చేశారు.

కలెక్టర్ పర్యటన అనంతరం దీక్షా శిబిరాన్ని ఖాళీ చేయించడంతోపాటు, గతంలో జరిగిన ఘటనపై కేసులు నమోదు చేసి, వారిని అరెస్టు చేస్తారని, అందుకే ఐదు జిల్లాల నుంచి వందలాదిమంది పోలీసులను రాజయ్యపేటలో దించారన్న ప్రచారం జోరందుకుంది. ఇదే గనుక జరిగితే తాడోపేడో తేల్చుకుంటామని, ప్రాణాలు పోయినా బల్క్ డ్రగ్ పార్క్ ఉద్యమం ఆపే ప్రసక్తి లేదని మత్స్యకారులు పట్టుదలగా ఉన్నట్టు భోగట్టా.



బల్క్ డ్రగ్ పార్క్ పనులు జరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇనుప గేట్లు



రాజయ్యపేట వెళుతున్న ఆటోల తనిఖీ

ఆందోళనకు టీడీపీ దూరం.. ఊరి సమస్యలోనూ రాజకీయమే!

రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న ఉద్యమం రాజకీయ రంగు పులుముకుంది. ప్రారంభంలో గ్రామస్తుల ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది టీడీపీ నాయకులు ఆందోళనలో పాల్గొన్నప్పటికీ హోంమంత్రిని అడ్డుకున్న తర్వాత టీడీపీ నాయకులు ఈ ఆందోళనకు దూరంగా ఉన్నారు. మిగిలిన మత్స్యకారులు మాత్రమే ఆందోళన కొనసాగిస్తున్నారు. మత్స్యకారులంతా గ్రామం కోసం, ప్రాణాల కోసం పోరాటం చేస్తుంటే రాజకీయ కారణాలతో టీడీపీ నాయకులు ముఖం చాటేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది టీడీపీ నాయకుల పేర్లు, వారి ఫొటోలు, బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు టీవీల్లో, పత్రికల్లో రావడంతో.. మన ప్రభుత్వమే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తుంటే మీరెలా నిరాహారదీక్ష శిబిరంలో కూర్చుంటారని పార్టీ పెద్దలు చీవాట్లు పెట్టినట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ శ్రావణి

రోలుగుంట: మండలం కె.నాయుడు పాలెం గ్రామానికి చెందిన ఇద్దరిపై ఎస్సీఎస్టీ కేసు నమోదైంది. దీనిపై గురువారం డీఎస్పీ ఎం.శ్రావణి స్థానిక ఎస్ఐ రామకృష్ణారావుతో కలసి గ్రామంలో విచారణ జరిపారు. ఈ నెల 14 తేదీ రాత్రి ఇదే గ్రామానికి చెందిన రాయి పురెడ్డి ప్రసాద్, గుములూరి రమణబాబులు తనను కులంపేరుతో దూషించి, కర్రతో దాడి చేశారని గ్రామానికి చెందిన ఉడతపల్లి సత్తిబాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సాక్షులను విచారించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేసు దర్యాప్తులో ఉందని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయస్థాయి వుషు పోటీలకు ఏఎంఏఎల్ విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య సభ్యులు

అనకాపల్లి టౌన్: ఇటీవల రాజమండ్రి ఎస్‌కేవీటీ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి వుషు పోటీల్లో స్థానిక ఏఎంఏఎల్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్‌లో టాటానగర్‌లో ఈ పోటీలు జరుగుతాయి.అండర్ 19 పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఎస్.తులసి రామ్, ఇ.ల క్షిత్, ఎ.వరప్రసాద్‌లను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు శ్రీదరాల కృష్ణ పేరరాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, గవర్నింగ్ బాడీ మెంబర్స్ వి.బాలకృష్ణ, కె.రవీంద్ర, వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో 4 కిలోల గంజాయి స్వాధీనం



ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులో గంజాయి రవాణాదారులు

తాటిచెట్లపాలెం(విశాఖ): మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. గురువారం ఉదయం మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లోని పలు రైళ్లలో రైల్వే భద్రతా దళం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సలీం పాషా, అమ్ముకుట్టి, నిషాదేవిలు కర్ణాటకకు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం వీరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించినట్లు మర్రిపాలెం ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

ఏయూ పరువు పాయే..!

- వైస్‌చాన్స్‌లర్‌కు అవమానం..!
- బాణసంచా దుకాణాల అనుమతుల విషయంలో విచిత్రం
- ఎన్నడూ లేని విధంగా ఉన్నత విద్యా శాఖ జోక్యం
- అనుమతులు ఇవ్వాలంటూ ఏయూ వీసీకి లేఖ రాయడంపై చర్చ
- ఏయూ వీసీ పరువు తీశారంటూ వర్సిటీలో దుమారం
- అనుమతులకు ముందే పనుల ప్రారంభంపై 'సాక్షి' కథనంతో ప్రకంపనలు
- ఉలిక్కిపడిన యంత్రాంగం.. కలెక్టర్ సీరియస్
- హెలిప్యాడ్ గ్రౌండ్ నుంచి పార్కింగ్ గ్రౌండ్‌కు వేదిక మార్పు



ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో బాణసంచా స్టాళ్ల ఏర్పాటుకు సన్నాహాలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ మరో వివాదం రాజుకుంటోంది. ఏయూలో బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం అగ్గి రాజేస్తోంది. ఏయూ వీసీ అనుమతులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు ఎన్నడూ లేని విధంగా తాత్కాలిక స్టాళ్ల అనుమతులకు ఉన్నత విద్యా శాఖ లేఖ రాయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇది వైస్ చాన్సలర్ పరువు తీయడమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామం విశ్వవిద్యాలయ అధికార, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కల్పించుకోవడం వెనుక ఆంతర్యమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదిలా ఉంటే ఏయూ నుంచి అనుమతులు రాకముందే స్టాళ్ల ఏర్పాటు పనులు చేపట్టడంపై 'సాక్షి' ప్రచురించిన కథనంతో అధికార వర్గాల్లో ప్రకంపనలు రేగాయి. దీనిపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీరియస్ అయినట్లు సమాచారం.

ఉన్నత విద్యా శాఖ జోక్యంపై చర్చ

సాధారణంగా ఏయూలో కార్యక్రమాల నిర్వహణకు ఏయూ సమావేశ మందిరాలు, మైదానాలు లీజుకు ఇవ్వడం సర్వసాధారణమైన విషయం. ఎవరైనా కార్యక్రమం నిర్వహణకు దరఖాస్తు చేసుకొని నిర్ణీత రుసుము చెల్లిస్తే.. ఏయూ వీసీ అనుమతులు ఇస్తుంటారు. గతంలో ప్రైవేటు కార్యక్రమాలకు కూడా అనుమతులు ఇచ్చేవారు. అయితే ఏయూ రాజకీయ వేదికగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ప్రైవేటు కార్యక్రమానికి ఏయూ, దానికి సంబంధించిన మైదానాల్లో అనుమతులు మంజూరు చేసే అవకాశం లేదు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్‌లో స్టాళ్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ఆలోచన చేస్తోంది. దీనిపై ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ హెలీప్యాడ్ గ్రౌండ్‌ను లీజుకు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ స్వయంగా ఏయూ వీసీకి లేఖ రాశారు. దీనిపై ఏయూ వీసీ నిర్ణయం తీసుకోకముందే పనులు జరిగిపోయాయి. ఇదిలా ఉంటే ఈ అనుమతుల విషయంలో నేరుగా ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం ఇపుడు వర్సిటీలో చర్చకు దారితీసింది. ఏయూ వీసీ నిర్ణయం తీసుకోవాల్సిన్న సర్వసాధారణ విషయంలో రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కల్పించుకోవాల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు అధికార వర్గాల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఇది ఏయూ వీసీని అవమానించడమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

21వ తేదీ వరకు అనుమతులు

కలెక్టర్ హరేందిర ప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఏయూ ఇంజినీరింగ్ హెలీప్యాడ్ గ్రౌండ్ లేదా దాని ఎదురుగా ఉన్న పార్కింగ్ మైదానాన్ని తాత్కాలిక స్టాళ్ల ఏర్పాటుకు లీజుకు ఇవ్వాలని ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కార్యాలయం నుంచి ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్‌కు లేఖ వచ్చింది. ఈ నెల 15న ఈ లేఖ రాగా వెంటనే ఏయూ వీసీ కూడా అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. కానీ 14వ తేదీ నుంచి అనుమతులు కోరినట్లు ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే ఆయన అనుమతులకు ముందే ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ పార్కింగ్ మైదానంలో మళ్లీ పనులు ప్రారంభించేయడం విషయం. ప్రస్తుతం అనుమతులు ఉండడంతో పనులు జరుగుతున్నాయి.

'కూటమి' జోక్యంతో వివాదం

ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ హెలిప్యాడ్ మైదానంలో స్టాళ్ల ఏర్పాటు కోసం అనుమతులు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్‌కు లేఖ రాశారు. దీనిపై ఏయూ వీసీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అనుమతులు ఇవ్వకముందే గ్రౌండ్‌లో స్టాళ్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. దీనిపై సాక్షి 'ఏయూ–జీవీఎంసీ మధ్య దివాళీ ట్రేడ్ ఫైర్' అంటూ కథనం ప్రచురించింది. దీంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఏ శాఖ నుంచి అనుమతులు రాకముందే, ఏయూ వీసీ గ్రౌండ్‌ను లీజుకు ఇవ్వకముందే పనులు చేపట్టడంపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీరియస్ అయ్యారు. వెంటనే ఆ పనులను ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే కూటమి ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. జిల్లా అధికారులతో పాటు ఏయూ వీసీతో కూడా మాట్లాడి అనుమతులు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు టాక్ వినిపిస్తోంది.

సదరు ప్రజాప్రతినిధి అనుచరులే ఈ మందుగుండు స్టాళ్ల పేరుతో దందాకు తెరతీసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో స్టాల్‌ను రూ.1.5 లక్షలకు బేరం పెడుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఏయూ గ్రౌండ్‌లో దుకాణాలను ఏర్పాటు చేయించాలని ప్రజాప్రతినిధి గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది.

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలి

- అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి: జిల్లాలో నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న రాజయ్యపేట ప్రజలకు మద్దతుగా స్థానిక నెహ్రూచౌక్ వద్ద అఖిలపక్ష పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు గురువారం ఒక రోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజయ్యపేటలో నెలల తరబడి సెక్షన్-30ని అమలు చేస్తున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. పోరాటానికి మద్దతు తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను గృహనిర్బంధం చేస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే విధంగా కూటమి ప్రభుత్వపాలన సాగుతోందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజయ్యపేట వచ్చిన అనిత విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని, బల్క్ డ్రగ్ పార్కుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత మాటమార్చడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజలు జీవించే హక్కును కాలరాసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ప్రజాభిష్టం మేరకు బల్క్ డ్రగ్ పార్కు ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, వి.వి. శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు ఆర్.దొరబాబు, వై.ఎస్.భద్రం, తాకాసి వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన మోహన్ రావు, రైతుసంఘం జిల్లా కోశాధికారి గండి నాని బాబు, నాయకులు కాళ్ళ తేలయ్యబాబు, అల్లు రాజు, మహిళా సంఘం పరమేశ్వరి, జి.సుభాషిణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా నేతను కించపరిచేలా వ్యాఖ్యలు దారుణం

- దళిత నేత కృపాలక్ష్మికి జీడీ నెల్లూరు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్–1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ డిమాండ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ

దేవరాపల్లి: కల్తీ మద్యంపై పోరాటం చేసిన చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మిని కించపరిచేలా టీడీపీ ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్–1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ అన్నారు. దేవరాపల్లి మండలం తారువలో గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. దళిత మహిళా నేత కృపాలక్ష్మి వ్యక్తిత్వ హననం చేసేలా టీడీపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు రాష్ట్రంలోని మహిళలందర్నీ అవమాన పరిచేలా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే వెంటనే కృపాలక్ష్మికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసిన మహిళా నేతపై దిగజారి విమర్శలు చేయడం అత్యంత దుర్మార్గమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అనురాధ డిమాండ్ చేశారు.

స్నేహితుడిని పరామర్శించి వస్తూ మృత్యువాత

- లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



బొడ్డేడ వంశీ (పాత చిత్రం)

గోపాలపట్నం (విశాఖ): చేతికి అందివచ్చి.. ఇంటికి అండగా ఉంటున్న కొడుకు మరణం ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది. ఆరు నెలల కిందట చెల్లెలి పెళ్లి చేసి మురిసిన అన్నయ్య.. ఈ రోజు కన్నీటి జ్ఞాపకంగా మిగిలిపోయాడు. ఒక స్నేహితుడిని పరామర్శించి వస్తున్న ఆ యువకుడిని మృత్యువు రోడ్డు రూపంలో కబళించింది. వేపగుంటలో ఉంటున్న స్నేహితుడికి తేలు కుట్టిందని తెలిసి పరామర్శించేందుకు బుధవారం రాత్రి వెళ్లిన బొడ్డేడ వంశీ (24) తిరిగి ఇంటికి వస్తుండగా.. అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిపై ఈ దారుణం చోటుచేసుకుంది. అక్కయ్యపాలెంలో నివాసముంటున్న వంశీ స్వస్థలం అనకాపల్లి జిల్లా చోడవరం మండలం చేమలాపల్లి. ట్రావెల్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్రవాహనంపై వేపగుంట నుంచి వస్తుండగా.. ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో వెనుకనే అతివేగంగా వస్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ధాటికి అదుపుతప్పిన వంశీ లారీ చక్రాల కింద పడి నలిగిపోయాడు. లారీ అతన్ని సుమారు 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లడంతో వంశీ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. కుటుంబానికి అండగా ఉంటున్న కుమారుడు అకాల మరణంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తండ్రి రామకృష్ణ లారెన్స్ సంస్థలో హౌస్ కీపర్‌గా పనిచేస్తున్నారు. బుద్ధిమంతుడైన కొడుకు లేడనే నిజాన్ని జీర్ణించుకోలేక వారు పడుతున్న వేదన అక్కడివారిని సైతం కంటతడి పెట్టించింది. ఆరు నెలల కిందటే వంశీ తన చెల్లెలు కావ్యకు అన్నీ తానై వివాహం జరిపించాడు. ఆ తీపి జ్ఞాపకాలు ఇంకా మరువకముందే.. అన్న మరణవార్త విన్న కావ్య కన్నీటి పర్యంతమైంది. తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

బీచ్ రోడ్డులో సీపీఆర్‌పై అవగాహన ర్యాలీ



ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ, వైద్యులు

మహారాణిపేట(విశాఖ): ప్రపంచ ఎనస్థీషియా దినోత్సవం, సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా కాళీమాత ఆలయం సమీపంలోని బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనస్థీషియా సొసైటీ, ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రస్థాయి రోగులకు చికిత్స అందించడంలో అనస్థీషియాలజిస్టులు, అత్యవసర వైద్యులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. సీపీఆర్ శిక్షణను సంవత్సరంలో ప్రతిరోజూ నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, విశాఖ అనస్థీషియా సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె.అపరంజి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, కేజీహెచ్‌లో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలక్ష్మి సహా పలువురు ప్రముఖ అనస్థీషియాలజిస్టులు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

వైజాగ్ హాఫ్ మారథాన్‌కు భారీ స్పందన



మారథాన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూ క్యాంపస్: వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్.. వైజాగ్ హాఫ్ మారథాన్ 2025 బీచ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో 2 వేల మందికి పైగా పాల్గొన్నారు. మారథాన్‌లో హాఫ్ మారథాన్ (21.1 కి.మీ), 10 కి.మీ పరుగు, 5 కి.మీ ఫన్ రన్ ఉన్నాయి. ఆర్‌కే బీచ్ నుంచి రుషికొండ మీదుగా ఈ మారథాన్‌ను నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం కమిషనర్ రన్‌లో పాల్గొన్న వారిని అభినందించారు. డిసెంబర్ 6, 7 తేదీల్లో పాడేరులో 100 కిలోమీటర్ల రన్ కూడా పెడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు www.vtra.run వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సత్యవతి

దాబాగార్డెన్స్: అనంతపురంలో జరిగిన ఐద్వా (ఆల్ ఇండియా డెమోక్రటిక్ వుమెన్స్ అసోసియేషన్) 16వ రాష్ట్ర మహా సభల్లో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో ఐద్వా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే కమిటీ సభ్యులుగా ఆర్.ఎస్.మాధవి, డి.కొండమ్మలను ఎన్నుకున్నారు. మహిళల హక్కులు, లైంగిక దాడులు, హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఇచ్చిన పిలుపును విశాఖలో పటిష్టంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా సత్యవతి తెలిపారు. ఇప్పటికే విశాఖలో మద్యంపై పోరు సాగిస్తున్నట్టు ఆమె వివరించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని, లూలూ మాల్, గూగుల్ వంటి సంస్థలకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని చేసిన పోరాటాలను మహాసభ ప్రశంసించిందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి పోరాటాలు కొనసాగిస్తామని సత్యవతి స్పష్టం చేశారు.

పాత కక్షతోనే వివాహిత హత్య

- ఏసీపీ లక్ష్మణమూర్తి
- నిందితుడు శ్రీను అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి (ఇన్‌సెట్) హత్యకు ఉపయోగించిన కత్తి

తాటిచెట్లపాలెం (విశాఖ): అక్కయ్యపాలెంలోని నందగిరినగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కావల శ్రావణసంధ్య అలియాస్ సోని(38) దారుణ హత్యకు పాత గొడవలే కారణమని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి గురువారం వెల్లడించారు. ఈ కేసు వివరాలను ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. శ్రావణ సంధ్యకు 9 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భర్త మణికంఠతో మనస్పర్ధల కారణంగా విడిపోయి, గత ఏడేళ్లుగా తన ఇద్దరు పిల్లలతో కలిసి నందగిరినగర్‌లో నివసిస్తోంది. మణికంఠ ప్రస్తుతం రాయగడలో ఉంటున్నాడు. వీరి విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. నిందితుడు శ్రీను(కార్పెంటర్) కూడా అదే ప్రాంతంలో, తన సోదరుడి ఇంట్లో నివసిస్తున్నాడు. సుమారు 8 నెలల కిందట శ్రీను..శ్రావణసంధ్య స్కూటీని డామేజ్ చేయడంతో, ఆమె ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పుడు పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చినా, శ్రీను ఆమెపై పగ పెంచుకున్నాడు. దీనికితోడు శ్రీను తరచుగా మరొక అమ్మాయితో మాట్లాడడాన్ని గమనించిన శ్రావణసంధ్య, అతడిని హెచ్చరించినట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం మళ్లీ వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న శ్రీను.. కోపం పెరిగి, కార్పెంటరీ పనుల కోసం ఉపయోగించే పదునైన కత్తితో శ్రావణసంధ్య మెడపై తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతురాలి సోదరి దేవి సంతోషికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. హత్య అనంతరం శ్రీను తప్పించుకోవడానికి ప్రయత్నించగా.. ఫోర్త్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ఉమాకాంత్ తన బృందంతో మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న ఫోర్త్‌టౌన్ పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ-1 మేరి ప్రశాంతి అభినందించారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి

విశాఖ సిటీ: బాణసంచా విక్రయాలపై పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. అనుమతులు లేకుండా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మందుగుండు సామగ్రి విక్రయాల కోసం లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేస్తూ.. దరఖాస్తుదారులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలను సూచించింది.

- లైసెన్స్ పొందిన దుకాణాల మధ్య కనీసం 15 మీటర్లు, గ్రీన్ క్రాకర్స్ అమ్మే దుకాణాల మధ్య 10 అడుగుల దూరం ఉండాలి.
- విద్యుత్, అగ్నిమాపక, జీవీఎంసీ విభాగాల నుంచి తప్పనిసరిగా ఎన్‌వోసీ పొందాలి. వాణిజ్య పన్నుల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాలి.
- లైసెన్స్ పొందిన ఫ్యాక్టరీ లేదా కంపెనీ నుంచి మాత్రమే బాణసంచా కొనుగోలు చేయాలి.
- విక్రేతలు గ్రీన్ క్రాకర్స్ మాత్రమే విక్రయించాలి. క్లోరేట్ కలిగిన బాణసంచా నిల్వ చేయకూడదు.
- దుకాణాలు అగ్నిమాపక కేంద్రాలకు అందుబాటులో ఉండాలి. ప్రతి దుకాణం వద్ద ఇసుక బకెట్లు, నీరు, అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచాలి.
- 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వ్యక్తులకు క్రాకర్లు అమ్మకూడదు.

కొనుగోలుదారులకు సూచనలు

- దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే క్రాకర్స్ కాల్చాలి.
- హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించకూడదు. సాధారణ సబ్బులను వాడాలి.
- అనధికారిక నిల్వలు లేదా విక్రయాలపై అనుమానం ఉంటే, పౌరులు నేరుగా డయల్ 100/112కు గాని లేదా సీపీ ఫోన్ నంబర్ 79950 95799కు గాని సమాచారం అందించాలని పోలీస్ శాఖ కోరింది.

పని చేసిన ఇంట్లోనే దొంగతనం

- అక్కాచెల్లెళ్ల అరెస్ట్

కూర్మన్నపాలెం(విశాఖ): తాను పని చేస్తున్న ఇంటిలోనే దొంగతనం చేసిన ఒక మహిళను, ఆమెకు సహకరించిన ఆమె సోదరిని దువ్వాడ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండున్నర తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరసింగరావు తెలిపిన వివరాలివి. రాజీవ్ నగర్‌లో నివాసముంటున్న వి.నరసింగరావు ఇంట్లో అనకాపల్లి జిల్లా, సోమలింగాపురానికి చెందిన కె.నాగమణి కొంతకాలంగా పనులు చేస్తోంది. నరసింగరావు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి.. బీరువాలోని చెవిదుద్దులు, పచ్చల హారాన్ని నాగమణి దొంగిలించింది. నగలు చోరీకి గురయ్యాయని గుర్తించిన నరసింగరావు ఈ నెల ఒకటో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా.. నాగమణి ఆ నగలను దొంగిలించి, వాటిని తన సోదరి సిహెచ్ సీతకు ఇచ్చినట్లు కనుగొన్నారు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి.. ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఏయూలో అంధకారం

- నీటి సమస్యతోనూ ఇబ్బందులు
- మహిళా ఇంజినీరింగ్ హాస్టల్‌లో దారుణ పరిస్థితులు
- ఆందోళనకు దిగిన విద్యార్థినులు

విశాఖ సిటీ: శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం అంధకారంలో కూరుకుపోయింది. ఏయూ ఇంజినీరింగ్ వుమెన్ హాస్టల్‌లో గురువారం ఉదయం నుంచి కరెంట్ లేక విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం తర్వాత ఏయూ క్యాంపస్ మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. చీకట్లు అలుముకున్నాయి. ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీని వరుస వివాదాలు, సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రధానంగా విద్యార్థుల విషయంలో ఏయూ అధికారుల నిర్లక్ష్య వైఖరి మరోసారి బయటపడింది. ఇప్పటికే పురుగుల భోజనం, వైద్య సదుపాయాలు లేక విద్యార్థి మరణం ఏయూలో కలకలం రేపగా.. తాజాగా నార్త్ క్యాంపస్‌లోని సావిత్రిబాయి పూలే మహిళా వసతి గృహంలో విద్యుత్, నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థినులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఏయూ అధికారులకు చెప్పేందుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంపై విద్యార్థినులు సాయంత్రం ఆందోళనకు దిగారు.

ఉదయం నుంచి స్తంభించిన విద్యుత్

ఏయూ నార్త్ క్యాంపస్‌లోని సావిత్రిబాయ్ పూలే మహిళా హాస్టల్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి కరెంట్‌తో పాటు నీటి సరఫరా కూడా లేకపోవడంతో విద్యార్థిలు తీవ్ర అవస్థలు పడ్డారు.

కాలకృత్యాలకు, తాగునీటికి కూడా నీరు లేకపోవడంతో బయట వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి గొంతులు తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొంతకాలంగా హాస్టల్‌లో నీటి సమస్య తీవ్రంగా పట్టి పీడిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్‌కు, అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు వాపోయారు

విద్యార్థినుల ఆందోళన

ఉదయం నుంచి విద్యుత్, నీటి సరఫరా లేకపోవడంపై విద్యార్థినులు ఏయూ అధికారులకు అనేకసార్లు సమాచారం అందించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఎవరి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం గమనార్హం. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఎవరూ ఎత్తకపోవడంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికి కూడా అదే పరిస్థితి ఉండడంతో ఆందోళనకు దిగారు. అప్పుడు హాస్టల్ అధికారులు వచ్చి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పోయిందని విద్యుత్ శుక్రవారం వస్తుందని చెప్పారు. అలాగే నీటి సమస్యపై అనేకసార్లు అధికారులకు లేఖలు రాశామన్నారు.

అయినప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించమని తేల్చి చెప్పారు. ఆ తర్వాత 10 నిమిషాలకు విద్యుత్‌తో పాటు నీరు వచ్చింది. మళ్లీ కొద్ది సేపట్లోనే మళ్లీ ఆగిపోయింది. ఈ సారి ఏయూ క్యాంపస్ మొత్తానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇంకెన్నాళ్లు?

- పరిష్కారం కాని సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అనకాపల్లి : జిల్లా కేంద్రం అనకాపల్లికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో పాలనాపరమైన వ్యవహారాలు కుంటుపడుతున్నాయి. పూర్తిస్థాయి అధికారిని నియమించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో వైపు పని భారం కారణంగా అనకాపల్లి తహసీల్దార్‌గా వచ్చేందుకు అధికారులు భయపడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ 35 వేల నుంచి 40వేల జనాభాకు ఒక తహసీల్దార్ ఉండాలి. ప్రస్తుతం అనకాపల్లి పట్టణ, మండల ఓటర్లు సుమారు రెండు లక్షల మంది ఉండగా, జనాభా సుమారు 2.70 లక్షల మంది ఉన్నారు. పని ఒత్తిడితో పాటు, జిల్లా కేంద్రమైన అనకాపల్లికి ఉన్నతాధికారులు తరచూ వస్తుండడంతో ప్రతీ పని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందే నిర్వహించవలసి వస్తోంది. దీంతో ఇక్కడ పనిచేసేందుకు అధికారులు భయపడుతున్నారు.

సకాలంలో అందని సర్టిఫికెట్లు

డిప్యూటీ తహసీల్దార్‌నే ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. ఆయనే రెండు బాధ్యతలను చూడవలసివస్తోంది. దీంతో కార్యాలయంలో పనులు సకాలంలో పూర్తి కావడంలేదు. కుల,ఆదాయ,నివాస సర్టిఫికెట్లు సకాలంలో అందక విద్యార్థులు, పాస్‌పుస్తకాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో...

వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటుచేసి, రెవెన్యూ పరంగా ప్రజలకు కావలసిన పనులుత్వరితగతిన పూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. కూటమి పాలనలో అన్ని పనులను తహసీల్దార్ కార్యాలయం సిబ్బందే చేయవలసి వస్తోంది. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లవలసి వస్తోంది. అయితే తహసీల్దార్ అందుబాటులో ఉండడం లేదు. దీంతోఏంచేయాలో అర్థంకాక ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. చిన్నపాటి పనులకు నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

భయం..భయంగా విధులు

తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న భవనం బ్రిటీష్ కాలంలో నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరింది. పైకప్పు నుంచి వర్షపునీరు లీకేజీ కావడంతో రికార్డులు తడిసి పాడైపోతున్నాయి. ఎప్పుడు పైనుంచి పెంకులు కిందపడతాయోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.




అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం, శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయ పై కప్పు, గోడ

మూడు సార్లు వెళ్లాను



కుటుంబ్రదీవీకరణ సర్టిఫికెట్ కోసం ఉడ్‌పేట సచివాలయంలో నమోదు చేసుకున్నాను. మూడు సార్లు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా అధికారులు అందుబాటులో లేరు. అక్కడ ఎవరిని అడగాలో అర్థం కావడంలేదు.

– కె.రుద్రినాయుడు, గవరపాలెం, అనకాపల్లి.

పూర్తిస్థాయి తహసీల్దార్‌ను నియమించాలి



ఏడాది నుంచి అనకాపల్లిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కొనసాగుతున్నారు. దీంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇక్కడ పూర్తిస్థాయి తహసీల్దార్‌ను నియమించాలి. జనాభాకు తగ్గట్టుగా ఇద్దరు తహసీల్దార్లు ఉండాలి. నా కుమారుడు కేంద్ర దళంలో చేరేందుకు రెసిడెన్షియల్ సర్టిఫికెట్ కోసం అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

– పెంటకోట శ్రీను, బెల్లంమార్కెట్ ఏరియా, రింగ్‌రోడ్డు, అనకాపల్లి.

నర్సుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నర్సుల సంఘం అధ్యక్షురాలు భవానీ, కార్యదర్శి వరలక్ష్మి

మహారాణిపేట: నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భవానీ, కార్యదర్శి వరలక్ష్మి కోరారు. గురువారం అనకాపల్లి జిల్లా డీఎంహెచ్‌వోను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అలాగే డీసీహెచ్‌ను కూడా కలిసి నర్సుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్టు అసోసియేషన్ అధ్యక్షురాలు భవానీ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సులు కూడా వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు.

త్వరగా అర్జీలకు పరిష్కారం చూపాలి

మునగపాక: ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం వీఆర్వోలు, సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాల్సిందేనన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన



అయ్యప్ప పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు కటకం లక్ష్మణరావు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో గల అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పమాలాధారణ భక్తులకు నెల రోజుల పాటు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కటకం లక్ష్మణరావు తెలిపారు. స్వామి ఆలయంలో మాలాధారణ భక్తులకు వైద్యులు దివాకర్, పండూరి గణేష్ ఆర్థిక సాయంతో 200 పుస్తకాలను ఉచితంగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకమాసంలో నెలరోజులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. కశింకోట, బయ్యవరం, విసన్నపేట, రామన్నపాలెం, తేగాడ, వెదురుపర్తి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు



ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్: బస్సుల్లో పరిమితికి మించి, వేలాడేలా ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు, కండక్టర్లతో బస్సు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులను ఎక్కడ పడితే అక్కడ నిలుపదల చేసి, ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర సభ్యురాలిగా వరలక్ష్మి



కశింకోట: ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కశింకోటకు చెందిన డి.డి. వరలక్ష్మి నియమితులయ్యారు. అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర ఐద్వా కమిటీ సమావేశంలో ఆమెను నియమించారు. ప్రస్తుతం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆమె ఎంపిక పట్ల పలు మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 351 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,980	5,980
మొదటి రకం	4,890	5,690
రెండో రకం	4,000	4,850
మూడోరకం	3,900	3,960

అనకాపల్లి సినిమాలు

రాజా	: తెలుసు కదా
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: డ్యూడ్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: మిత్రమండలి
వెంకటేశ్వర	: మమ్మీ ఈజ్ బ్యాక్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-16, బి పాజిటివ్-25, ఒ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-4 యూనిట్ల శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(ఫోన్ నంబర్.9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 345 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్.08924-223595)ని సంప్రదించవచ్చు.

చేతుల శుభ్రతతో వ్యాధులకు దూరం



చేతులను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: చేతుల శుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈజే అనీల్ కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హ్యాండ్ వాష్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ భోజనం చేసేటప్పుడు, కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శంకరరావు, పాఠశాల చైర్మన్ బలరాం స్వామి, పంచాయతీ కార్యదర్శి వి.ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో సేవలపై ఆరా



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ నాయుడు

అనకాపల్లి టౌన్: రక్తంలో సుగర్ తగ్గితే అతిగా నీరసపడిపోవడం, గుండె దడ, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటాయని, వారు తక్షణమే సమీపంలో ఆస్పత్రికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకోవాలని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డి.డి. నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించి పలువురు రోగులతో మాట్లాడి, అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాయానికి ఆహారం తీసుకోకపోవడం, మందులు సక్రమంగా వాడకపోవడం వల్ల సుగర్ తగ్గుతుందన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనసేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు.

108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

'ఇంటర్ ఉద్యోగుల సంఘ' రాష్ట్ర కార్యదర్శిగా మురళీమోహన్



మురళీమోహన్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శిరీషారాణి, సిబ్బంది

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.మురళీమోహన్ ఏపీ ఇంటర్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శిరీషారాణి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. అతి తక్కువ సమయంలో స్టేట్ సెక్రటరీగా ఎంపికవడం కళాశాలకు గర్వకారణమే కాకుండా ఇంటర్ బోర్డుకు కూడా మంచి జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎ.జనార్దనరావు, ఎం.మోహనరావు, పి.సుభాషిణి, పి.సూర్యశ్రీ, బి.గోవిందరావు, ఎస్ఎల్ఎన్వీ ఉదయ్‌కుమార్, ఎన్.శ్రీనివాసరావు, బి.బాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

పెందుర్తి: నగరంలో నిర్వహించనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. సుజాతనగర్ సమీపంలోని కార్మికనగర్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సైతం కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. సీఐటీయూ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును దేశ, రాష్ట్ర స్థాయి నేతలు ఎండగడతారని పేర్కొన్నారు. మహాసభలో ఆఖరి రోజు లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన ఉంటుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.జగన్, జోన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావ్, నాయకులు కె.అప్పలనాయుడు, జి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్న నరసింహమూర్తి

అనకాపల్లి: విద్యార్థి దశనుంచి కష్టపడి చదివితే ఉన్నతశిఖరాలను అధిరోహించవచ్చని పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తి అన్నారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ పట్టణప్రైమరీ స్కూల్‌లో 75 మంది విద్యార్థినీవిద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 16వ తేదీ నుంచి జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

విలువలే వ్యక్తిత్వానికి పునాది



లా వర్సిటీ మాజీ వీసీ సత్యనారాయణను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

గోపాలపట్నం(విశాఖ): మన విలువలే వ్యక్తిత్వానికి పునాది అని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. నమ్మకాలు, విలువలే వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయన్నారు. నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ ఇన్ ఎడ్యుకేషన్ అంశంపై గురువారం ఏర్పాటు చేసిన సెమినార్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మానవతా విలువల్లేని వ్యక్తి ఆకారానికే పరిమితమవుతాడన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు.అనంతరం ఆయన్ను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ జీవన్ రావు, కె.సత్యనారాయణ, కె.దయానా పాల్గొన్నారు.

ఓట్ల నమోదులో బీఎల్వోలది కీలక పాత్ర

పెందుర్తి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకునేలా బూత్ లెవల్ అధికారు(బీఎల్వో)లు అవగాహన కలిగించాలని తహసీల్దార్ ఐ.వెంకటఅప్పారావు అన్నారు. ఓట్ల నమోదుతో పాటు ఎన్నికల ప్రక్రియలో బీఎల్వోలది కీలక పాత్ర అని చెప్పారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈసీ నియమావళి అమలు వంటి అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు.

మత్స్యకార యువత భవిత కోసం ప్రత్యేక శిక్షణ



మత్స్యకార సంక్షేమ సమితి సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీపన్

రాంబిల్లి(అచ్యుతాపురం): మత్స్యకార యువత ఉజ్వల భవిష్యత్ కోసం అవసరమైన అన్ని రకాల శిక్షణలు ఇప్పిస్తామని సీమ జాగరణ మంచ్ సహ సంచాలకుడు ప్రదీపన్ తెలిపారు. రాంబిల్లి మండల మత్స్యకార సంక్షేమ సమితి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రివిధ దళాలకు సంబంధించిన శిక్షణను మత్స్యకార యువత పూర్తి చేసి దేశ సరిహద్దుల్లో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు. మత్స్యకార యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి(ఎంఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వాసు, రాష్ట్ర కార్యదర్శి గురునాథ్, రాష్ట్ర సంఘటన కార్యదర్శి రంగనాయకులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సూరాడ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయం దారి మూసివేత

గేటు ముందు పూజలు చేసి నిరసన




పూజలనంతరం గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బపాలెం వీధిలో ఉన్న వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వెళ్లే రహదారి గేటుకు తాళం వేసి, ఆలయంలోకి వెళ్లకుండా కొంత మంది వ్యక్తులు అడ్డుకున్నారని ఆలయ ధర్మకర్త మళ్ల రామచంద్రరావు తెలిపారు. ఆలయానికి వెళ్లే రహదారి గేటు ముందు గురువారం భక్తులు పూజలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన వరాహలక్ష్మీనరసింహ ఆలయాన్ని దివంగత మళ్ల దాసులు తాతయ్య నిర్మించారని, అప్పటి నుంచి ఆయన కుటుంబ సభ్యులే ఆలయ బాధ్యతను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఐదో తరం కుటుంబ సభ్యులమైన మేం ఇటీవల కాలంలో చేసిన ఆలయ అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంత మంది వ్యక్తులు ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని పన్నాగం పన్నారన్నారు. అందులో భాగంగానే ఆలయానికి వెళ్లే మార్గం గేటుకు తాళాలు వేశారని, దీనివల్ల స్వామి వారికి ధూపదీపనైవేద్యాలు జరగడం లేదన్నారు. తక్షణమే స్థానిక నాయకులు స్పందించి ఆలయాన్ని తెరిపించి యథావిధిగా ఆలయంలో పూజలు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్



పీడీల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాద్

కశింకోట: మండల స్థాయి స్కూలు గేమ్స్ శుక్రవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మొదటి రోజు బాలురకు, రెండో రోజు శనివారం బాలికలకు పోటీలు జరపనున్నారు. ఈ మేరకు పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లతో గురువారం స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలులో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. బాలురకు డీపీఎస్ జెడ్పీ స్కూలు, బాలికలకు.. బాలకల హైస్కూలులో నిర్వహించారలని కూడా నిర్ణయించారు. కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి, మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను డివిజన్ స్థాయికి పంపనున్నట్టు డీపీఎస్ హైస్కూలు హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. మండలంలోని 10 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఆదర్శ, కస్తూర్బా గాంధీ విద్యాలయం, గురుకుల పాఠశాలలు, తాళ్లపాలెంలోని రెండు ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 600 మంది బాల బాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు.సమావేశంలో పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం



మానసిక వైకల్యంతో బాధపడుతున్న ప్రేమ్‌కుమార్‌కు సపర్యలు చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: మానసిక వైకల్యంతో అనాథగా తిరుగుతున్న ఓ వ్యక్తికి పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. నగరంలోని హెచ్‌బీ కాలనీకి చెందిన చింతల ప్రేమ్‌కుమార్(35) చిన్ననాటి నుంచి మతిస్థిమితం లేదు. తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో అతడు అనాథగా మారాడు. ఈ క్రమంలో పెందుర్తి ప్రాంతంలో తిరుగుతున్న ప్రేమ్‌కుమార్ పరిస్థితిని స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ గమనించి, సీఐ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఐ స్వయంగా ప్రేమ్‌కుమార్ వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. అనంతరం లయోలా వృద్ధాశ్రమానికి తరలించారు.

రాష్ట్రంలో మహిళలపై పెరిగిన వేధింపులు



ఐద్వా మహాసభకు హాజరైన పరవాడ ప్రాంతానికి చెందిన అనకాపల్లి జిల్లా ప్రతినిధులు

పరవాడ: రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు పెరిగిపోయినా కూటమి ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని ఐద్వా అనకాపల్లి జిల్లా కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో ఇటీవల జరిగిన ఐద్వా మహాసభకు హాజరైన పరవాడ ప్రతినిధులు గురువారం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు ప్రక్రియను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పరవాడలో ఫార్మా కాలుష్యం బారిన పడుతున్న గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రణాళికాబద్ధంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పాల్గొన్నారు.